క్లుప్తంగా

కావలి రూరల్ సర్కిల్ విభజనకు ప్రతిపాదనలు

కావలి: కావలి రూరల్ పోలీస్ సర్కిల్‌ను రెండుగా విభజించడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి జిల్లా అధికారులు ప్రభుత్వానికి పంపారు. కావలి రూరల్ సర్కిల్ పరిధిలో అల్లూరు, దగదర్తి, బిట్రగుంట, కావలి రూరల్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఈ సర్కిల్‌ను ఒక సీఐ పర్యవేక్షిస్తుంటారు. కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ వరకే ఒక సీఐను నియమించేలా, బిట్రగుంట కేంద్రంగా మరో సీఐను నియమించి అందులో అల్లూరు, దగదర్తి పోలీస్‌స్టేషన్ కూడా ఉండేటట్లుగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికి కావలి నియోజకవర్గంలో కావలి వన్ టౌన్, టూటౌన్, కావలి రూరల్ పోలీస్‌స్టేషన్లకు సీఐలు ఉండగా, కొత్తగా బిట్రగుంటకు సీఐను నియమిస్తే నలుగురు సీఐలు ఉండనున్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు దగదర్తి ఎంపీపీ అభినందనలు



జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను అభినందిస్తున్న ప్రసాద్ నాయుడు

కావలి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తి చేసుకున్న ఆనం అరుణమ్మను దగదర్తి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు కలిసి పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 46 మంది జెడ్పీటీసీలను, 46 మంది ఎంపీపీలను సోదర, సోదరీమణుల భావంతో అందరినీ ఆప్యాయంగా పలకరించే ఆనం అరుణమ్మ జెడ్పీ పాలనలో కొత్తదనం చేతల్లో చూపించారని తాళ్లూరు ప్రసాద్‌నాయుడు అన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వినియోగదారుల ఫోరం సభ్యులు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ కన్జుమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కే తిరుపాలు మంగళవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నా ణ్యత లేని తినుబండరాలు తినడం మానేసిన వా రికి మా వినియోగదారుల ఫోరం తరపున బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం నియోజకవర్గ చైర్మన్ కదిరి రంగారావు, వెంకటమోహన్, మహేష్, రామకృష్ణ, మల్లికార్జున పాల్గొన్నారు.

ధాన్యం నాణ్యత పరిశీలన



ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న సివిల్ సప్లయిస్ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీనారాయణ

సంగం: మండలంలో సివిల్ సప్లయిస్ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీనారాయణ మంగళవారం వరి కోతల వద్ద ధాన్యం నాణ్యతను పరిశీలించారు. మండలంలోని ర్యాంపు, మర్రిపాడు గ్రామాల సమీపంలో రహదారిపై పోసి ఉన్న ధాన్యం రాసులను పరిశీలించారు. ధరల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యువతిపై దాడి చేశారని ఫిర్యాదు

ఆత్మకూరు: మద్యం మత్తులో కొందరు తనపై దాడి చేశారని, అసభ్యంగా ప్రవర్తించారని పట్టణంలోని చెరువు సమీపంలో నివశిస్తున్న ఓ యువతి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ జి.వేణు, ఎస్సై కె.ముత్యాలరావు ఫిర్యాదు అందిన వెంటనే పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించారు. ఆ యువతి హాస్టల్ సమీపంలో మద్యం మత్తులో ఉన్న మరో వ్యక్తితో ఉండడాన్ని గుర్తించిన ఆమె దూరపు బంధువైన యువకుడు తన మిత్రులతో కలిసి వారిపై దాడి చేశారు. ఆ సమయంలో ఆ యువకులు సైతం మద్యం మత్తులో ఉన్నారని సమాచారం. ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

చేజర్ల (సోమశిల): వివిధ పాఠశాలల గణిత, ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం అనంతసాగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగింది. ఆత్మకూరు, మర్రిపాడు, అనంతసాగరం నుంచి గణిత ఉపాధ్యాయులు శిక్షణ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశాలకు పర్యవేక్షకులుగా రిసోర్స్ పర్సన్‌లు అందే సురేష్ కుమార్, శ్రీలత వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కే ప్రభాకర్‌రెడ్డి, స్కూల్ హెచ్ఎం బి.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్య భద్రత

ప్రజలకు ఆరోగ్యంపై చైతన్యం కల్పిస్తూ, ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 15వ తేదీ నుంచి మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్త ప్రతి ఇంటికి వెళ్లి ఏడు రకాల పరీక్షలు చేస్తున్నారు. తద్వారా ఎవరికి ఎలాంటి వైద్యం అందించాలనేది సర్వే చేస్తున్నారు.

- ఈ నెల 30 నుంచే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు
- ముందస్తుగా ప్రాథమిక వైద్య పరీక్షల ద్వారా సర్వే



కావలి పట్టణంలోని తుపాన్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోపరీక్షలు చేస్తున్న వైద్య బృందం

కావలి: ఈ నెల 30 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలకు కావలి నియోజకవర్గంలో సర్వసన్నద్ధమైంది. కావలి పట్టణంతో పాటు కావలి, బోగోలు, దగదర్తి, అల్లూరు మండలాల్లో ఈ నెల 15వ తేదీ నుంచి ఇప్పటి వరకు 74,024 మందికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. ప్రాథమికంగా ఎవరికి ఎలాంటి అనారోగ్య పరిస్థితులు ఉన్నాయో నిర్ధారించి వారికి మెరుగైన వైద్యానికి అవసరమైన ఏర్పాట్లు చేయడానికి ప్రణాళిక రూపొందించారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రారంభం నుంచి ప్రతి రోజూ ప్రతి మండలంలో ఏదో ఒక వైఎస్సార్ విలేజ్ క్లినిక్, పట్టణంలో ఏదో ఒక వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తారు. నెల రోజుల పాటు ఈ శిబిరాల నిర్వహణ కొనసాగుతోంది. ఈ వైద్య శిబిరాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లు సేవలందిస్తారు. ఆయా మండలాల్లోని ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులతో పాటు ఫ్యామిలీ డాక్టర్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొంటారు.

162 రకాల మందు అందుబాటు

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ల్లో 162 రకాల మందులతో పాటు 18 రకాల శస్త్రచికిత్సల వస్తువులు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్లు తదితరాలను అందుబాటులో ఉంచుతారు. ఆరోగ్య సమస్యలున్న వారిని వైద్యులు పరీక్షిస్తారు. అవసరమైన వారికి ఈసీజీ వంటి వైద్య పరీక్షలు కూడా చేసి ఉచితంగా మందులిస్తారు. ఎవరికైనా పెద్ద చికిత్సలు అవసరమైతే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రెఫరల్ చేస్తారు. ఇంటింటి సర్వే నిర్వహణ సమయంలో సాధారణ వాటితో పాటు దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణులు, బాలింతలు, తగిన బరువులేని పిల్లలు, క్షయ, కుష్ఠు వ్యాధులు కలిగిన వారు ఉంటే ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

ప్రతి ఇంటిని మ్యాపింగ్

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఇంటిని సందర్శించి మ్యాపింగ్ చేస్తున్నారు. ఏ ఇంట్లో ఎవరు ఎలాంటి ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నారో గుర్తిస్తారు. గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక హెల్త్ క్యాంప్ల ద్వారా వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన పరీక్షలు చేయడం పాటు మందులు, కంటి పరీక్షలను కూడా క్యాంపులో నిర్వహించి కళ్లద్దాలు అందిస్తారు. క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు వంటి దీర్ఘకాలిక జబ్బుల బాధితులను (క్రానిక్ డిసీజెస్) గుర్తించి వైద్యం అందించనున్నారు. ఒక వైపు సరైన సమయంలో చికిత్స అందిస్తూనే జీవన విధానాల్లో తీసుకోవాల్సిన మార్పులు, ఆయా వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై (ప్రివెంటివ్ కేర్) ప్రజల్లో అవగాహన పెంపొందించనున్నారు. ప్రత్యేక హెల్త్ క్యాంప్‌ల ద్వారా వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన పరీక్షలు చేయడం పాటు మందులు, కళ్లద్దాలు అందిస్తారు. స్పెషలిస్ట్ వైద్యుల్లో గైనిక్/పీడియాట్రిక్ స్పెషలిస్ట్ డాక్టర్ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ముమ్మరంగా ప్రాథమిక వైద్య పరీక్షలు

వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రత కల్పించాలనే గొప్ప ఉద్దేశంతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి చెబుతున్నారు. కావలి నియోజకవర్గంలో 2,16,577 మందికి పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా, మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలతో కలిసి వలంటీర్లు బృందాలుగా ఏర్పడి మంగళవారం నాటికి 74,024 మందికి పరీక్షలు చేశారు. ఇప్పటికే వలంటీర్లు జగనన్న సురక్ష, ఆరోగ్యశ్రీపై ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో (వైద్య శిబిరం) టోకెన్లు జారీ చేసి ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య సేవలు అందజేయనున్నారు. ఇందుకోసం హెల్ప్ డెస్క్, స్పాట్ సర్వే కౌంటర్, కేసు షీట్ కౌంటర్, ల్యాబ్ టెస్టింగ్ కౌంటర్, మందుల పంపిణీ కౌంటర్, కంటి వైద్య పరీక్షలు, అద్దాల పంపిణీ కౌంటర్లను ఏర్పాటు చేస్తారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



ఆత్మకూరు: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు, సిబ్బంది

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. మున్సిపల్ పరిధిలోని 12, 13, 14 వార్డుల్లో మంగళవారం అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ అస్మ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ తిరుపతమ్మ, సూపర్ వైజర్ సుధాకర్, ఏఎన్ఎం నూర్‌జహాన్, ఆశ వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష జనం చెంతకు చేరాలి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ప్రజలందరికీ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జనం వద్దకు చేరేలా ప్రభుత్వ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని మర్రిపాడు మండల జేసీఎస్ కన్వీనర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిలకపాడు సచివాలయంలో వైద్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యం అందించేలా ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. కార్యక్రమంలో ఏపిలగుంట ఎంపీటీసీ నాయుడు హజరత్ రెడ్డి, సంబంధిత శాఖల సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా జగనన్న ఆరోగ్య సురక్ష

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సూచించారు. మండలంలోని బట్టేపాడు, అప్పారావుపాళెం సచివాలయాల్లో మంగళవారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆరోగ్యశాఖ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎంలు, తమ ఆరోగ్య శాఖ సిబ్బందిని కలిసి ప్రతి ఇంటిని సదర్శించాలన్నారు. క్యాంపు నిర్వహణలో ప్రజలకు అసౌకర్యం లేకుండా సజావుగా కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బొటిక నరసింహులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మహిమలూరు, బసవరాజుపాళెం, కటటంపాడు, బోయలచిరివెళ్ల, అశ్వనీపురం, తదితర గ్రామాల్లో నిర్వహించిన సర్వేలను మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు టీజే దేవానంద్, అనూషాకుమారి మంగళవారం పర్యవేక్షించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఓ వరం

చేజర్ల: ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తూ ఇంటింటికి తిరిగి ఆరోగ్య పరిస్థితులపై నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష ఒక వరమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు ప్రజల ఆరోగ్య పరిస్థితిని రికార్డుల్లో నమోదు చేశారు.



చిలకపాడులో మాట్లాడుతున్న మండల జేసీఎస్ కన్వీనర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి



బట్టేపాడులో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్



చేజర్ల: కోటితీర్థం బీపీ పరీక్ష చేస్తున్న దృశ్యం

చెరువు తూములకు వాల్వ్ ఏర్పాటు

అనుమసముద్రంపేట: మండలంలోని చిరమన చెరువు తూములకు నూతనంగా వాల్వ్ రాడ్‌లను ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేశారు. మూడు నెలల క్రితం చిరమన చెరువు పూడిక తీత పనులు చేయిస్తున్న తరుణంలో ఓ రైతు తూము పూడికలో ఇరుక్కుని మృతి చెందాడు. ఈ విషయమై ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి రాజవోలు సొసైటీ మాజీ చైర్మన్ కాటంరెడ్డి నారసింహారెడ్డి తీసుకెళ్లి వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి కొత్త వాల్వ్ బిగించి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు మంగళవారం ఏర్పాటు చేశారు.



చెరువు తూములకు నూతనంగా వాల్ రాడ్‌లు ఏర్పాటు చేసిన దృశ్యం

గ్యాస్ కోసం ఆందోళన

ఉదయగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న దీపం గ్యాస్ స్టాక్ పాయింట్‌లో సిలిండర్ల కొరతతో వినియోగదార్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం స్టాక్ పాయింట్ వద్ద పలువురు వినియోగదార్లు ఆందోళనకు దిగారు. సీతారామపురం, దుత్తలూరు, మర్రిపాడు, ఉదయగిరి మండలాల్లో 1,400 గ్యాస్ కలెక్షన్లు ఉన్నాయి. కొంత కాలం నుంచి సిలిండర్ల కొరతతో వినియోగదార్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



స్టాక్ పాయింట్ వద్ద ఆందోళన చేస్తున్న వినియోగదార్లు

ఎంపీడీఓకు సన్మానం

ఉదయగిరి: ఉదయగిరి ఎంపీడీఓగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డి.ఈశ్వరమ్మను మంగళవారం కార్యాలయంలో మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కల్లూరి.వెంకటేశ్వరరెడ్డి సన్మానించారు. మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. మండల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో దాసరపల్లి సర్పంచ్ సయ్యద్‌గౌస్‌మొహిద్దీన్, గండిపాళెం కార్యదర్శి గాజులపల్లి అమర్‌నాథ్‌రెడ్డి, ఏఓ రేణుకా, ఈఓపీఆర్డీ ఎన్. మల్లికార్జున, సీనియర్, జూనియర్ సహాయకులు గోపి, సమద్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక

కావలి: రాష్ట్రస్థాయి క్రీడలకు కావలి జవహర్ భారతి జూనియర్ కాలేజీ విద్యార్థిని, విద్యార్థులు ఎంపికయ్యారు. వాలీబాల్‌కు విక్రమ్, గిరి, సాయి, హ్యాండ్ బాల్‌కు కీర్తన, అఖిల, స్విమ్మింగ్‌కు కీర్తన, రేవతి, ఖోఖోకు రేవతి, సౌమ్య, తిరుమల తదితరుల ఎంపికయ్యారు.

ఆర్ఐ బాధ్యతల స్వీకరణ



సాయికిరణ్

వరికుంటపాడు: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా సాయికిరణ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తిరుపతి కలెక్టరేట్‌లో జూనియర్ సహాయకుడి గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు.

పాలిటెక్నిక్‌లో నేరుగా ప్రవేశానికి అవకాశం

ఆత్మకూరు: పదో తరగతి పాసైన విద్యార్థినీ, విద్యార్థులు నేరుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కోర్సుల్లో చేరవచ్చునని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వెంకట రమణారెడ్డి, మంగళవారం తెలిపారు. ఇటీవల వరకు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పాసైన విద్యార్థులకు కౌన్సెలింగ్ ద్వారా కళాశాలల్లో ప్రవేశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల 2వ తేదీలోపు ఆసక్తి గల విద్యార్థులు అప్లికేషన్లు కళాశాలల్లో ఇవ్వాలన్నారు. 3వ తేదీ స్పాట్ అడ్మిషన్లు ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 98856 31747, 94933 56797 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉచిత కుట్టు శిక్షణ

కావలి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కావలి తాలూకా విభాగం ఆధ్వర్యంలో పేద మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతి రోజు అక్టోబర్ 2వ తేదీ ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఫైర్ ఆఫీస్ రోడ్డులో ఉన్న పెన్షనర్ల భవనంలో జరిగే ఈ శిక్షణలో పాల్గొనే మహిళలు 99852 37349, 99633 57705 నంబర్లలో సంప్రదించి నమోదు చేసు కోవాలని కోరారు.

నీ స్థాయి ఎంత.. నువ్వెంత

- ప్రజల మద్దతుతో రెండు సార్లు గెలిచిన ఎమ్మెల్యేని విమర్శిస్తావా?
- పసుపులేటి.. డబ్బు మదంతో తూలనాడితే తగిన శాస్తి తప్పదు
- వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు



మాట్లాడుతున్న మద్దిబోయిన వీరరఘు

బిట్రగుంట: 'జెండా.. అజెండా లేని ఓ గల్లీ స్థాయి వ్యక్తి.. తనకు తాను నియోజకవర్గ స్థాయి లీడర్‌గా భ్రమపడుతున్న పసుపులేటి సుధాకర్.. నీ బతుకేంటో బోగోలు మండల ప్రజలకు తెలుసు. ప్రజల మద్దతుతో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై వ్యక్తిగత దూషణలు చేస్తున్నావు. నీ స్థాయి ఎంత.. నువ్వెంత. తెలుసుకో. డబ్బు మదంతో ఎమ్మెల్యేపై, వైఎస్సార్‌సీపీని విమర్శిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు' అని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు అన్నారు. బోగోలులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో రఘు మాట్లాడారు. అవినీతి పరుడుగా జైల్లో ఊచలు లెక్కపెడుతున్న చంద్రబాబు ప్రాపకం కోసం కూలీ జనాన్ని పోగేసి ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తూ ప్రభుత్వంపైన, కావలి ఎమ్మెల్యేపైన సుధాకర్ చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రూ.కోట్లు కుమ్మరించినా.. సొంత సోదరుడిని వార్డు మెంబర్‌గా కూడా గెలిపించుకోలేని స్థాయి నీది.. నువ్వు ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డిని విమర్శిస్తావా అంటూ మండిపడ్డారు. నియోజకవర్గంలో రెండు సార్లు అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలిపించుకున్న ఘనత ప్రతాప్‌కుమార్‌రెడ్డిదన్నారు. గ్రావెల్ దోపిడీ అంటూ నానా హంగామా చేస్తున్న సుధాకర్ బోగోలు మండలంలో తాను కొనుగోలు చేసిన భూములకు ఎక్కడి నుంచి గ్రావెల్ తరలించారో చెప్పాలని డిమాండ్ చేశారు. గనుల శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారా, తీసుకుంటే ఎన్ని క్యూబిక్ మీటర్లకు అనుమతులు తీసుకున్నారు, ఎంత మేర సీనరేజీ చెల్లించాలో చెప్పాలని నిలదీశారు. నోరు ఉందని, డబ్బులు ఉన్నాయని నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలే తరిమికొడుతారని హెచ్చరించారు.

జెండా, అజెండా లేని వ్యక్తి సుధాకర్

పగటి కలలు కంటూ తిరుగుతున్న పసుపులేటి సుధాకర్‌కు రాజకీయంగా జెండా, అజెండా లేదని రఘు ఎద్దేవా చేశారు. కొద్ది రోజులు జనసేన పార్టీ అని, మరి కొద్ది రోజులు బీజేపీ పార్టీ అని, చివరకు టీడీపీ జెండా పట్టుకుని తిరుగుతున్నారని తెలిపారు. సుధాకర్ ఏ పార్టీలో ఉంటారో, ఏ పార్టీ తరఫున పోటీ చేస్తారో అయన వెంట తిరుగుతున్న వాళ్లకు కూడా అర్థం కాక అయోమయంలో ఉన్నారని తెలిపారు. సుధాకర్‌కు ఏ పార్టీ టికెట్ ఇవ్వదని, చివరకు ఇండిపెండెంట్‌గా పోటీ చేసినా డిపాజిట్లు కూడా దక్కవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తూపిలి పెంచలయ్య, సుంకే మాల్యాద్రి, పత్రి అంకులయ్య, తుమ్మల రమణయ్య, పాశం రవీంద్రబాబు, ఉప్పాల మాచర్ల, నాయబ్ రసూల్, సుందర్‌రాజు, మేకల సాల్మన్‌రాజు, ఆకుల డేవిడ్‌పాల్, పోతల ప్రసాద్, కంటేపల్లి కృష్ణయ్య, పాపన మల్లారెడ్డి, నవాజ్, షేక్ మన్సూర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

తండ్రి నుంచి మాకు ప్రాణహాని ఉంది

- సీఐకి ఫిర్యాదు చేసిన చిన్నారులు



సీఐతో మాట్లాడుతున్న చిన్నారులు

ఉదయగిరి: తమ తండ్రి నుంచి ప్రాణ హాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని మండలంలోని అప్పసముద్రం గ్రామానికి చెందిన చిన్నారులు షేక్ నస్రిన్, నఫీక్ బాషా మంగవారం సీఐ వి.గిరిబాబుకు తమ బంధువుల ద్వారా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఉండగా తండ్రి మా అమ్మను ఉరేసి చంపేశాడు. అక్కడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి తాము మా అమ్మమ్మ ఊరు అప్పసముద్రంలో ఉంటున్నాం. ఈ క్రమంలో మా నాన్న తరుచు మాకు ఫోన్ చేసి హైదరాబాద్ రావాలని బెదిరిస్తున్నాడు. దీంతో మాకు భయంగా ఉంది. మా నాన్న నుంచి మాకు ప్రాణహాని ఉందని చెప్పారు. వెంటనే సీఐ ఫోన్‌లో వారి తండ్రితో మాట్లాడారు. ఉదయగిరి స్టేషన్‌కు రావాలని చెప్పారు. అనంతరం చిన్నారులతో మాట్లాడి మీకు ఎలాంటి సమస్య రాదని ధైర్యం చెప్పారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు నలుగురు ఎంపిక



ఎస్ నాని



బి సందేశ్



ఎం దయానా చక్రవర్తి

ఆత్మకూరు: నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి మైదానంలో జరుగుతున్న జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపికల్లో నలుగురు ఆత్మకూరు విద్యార్థులు తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నియోజకవర్గ క్రీడా కో ఆర్డినేటర్ తిరుపతయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీల్లో ఎంపికైన విద్యార్థులకు నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి మైదానంలో క్రీడా పోటీలు జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా ఫుట్‌బాల్‌లో అండర్–17లో ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి బి సందేశ్, వెస్ట్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్ నాని, అండర్–14 బాలికల విభాగంలో ఎం దయానా చక్రవర్తి, బాలుర విభాగంలో శ్రీనివాస ఇంగ్లిషు మీడియం పాఠశాల విద్యార్థి ఎస్ రాములు ఎంపికైనట్లు ఆయన వివరించారు. అండర్–17లో ఎంపికైన క్రీడాకారులకు కర్నూలులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు, అండర్–14లో ఎంపికైన విద్యార్థులు వైజాగ్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జర్నలిస్ట్ మృతికి సంతాపం

చేజర్ల: చేజర్లలో ఓ పత్రిక జర్నలిస్ట్‌గా పనిచేస్తూ అనారోగ్యం కారణంగా మృతి చెందిన ఓ వినోద్‌కు పలువురు జర్నలిస్ట్‌లు సంతాపం ప్రకటించారు. మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి సురేష్, హజరత్తయ్య, నాగేంద్రరెడ్డి జర్నలిస్ట్ వినోద్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందాలి

ఉదయగిరి: ప్రతి సచివాలయ పరిధిలో అర్హత ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వం అందజేసే ప్రతి సంక్షేమ పథకం అందాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గానుగపెంట ఓబులరెడ్డి తెలిపారు. మండలంలోని గన్నేపల్లి సచివాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అర్హత ఉండి ఏ ఒక్కరికి కూడా సంక్షేమ పథకం అందలేదనే మాట రాకుండా అందరికీ న్యాయం చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీఎస్ కన్వీనరు కృష్ణారెడ్డి, స్థానిక నేతలు ఇత్తడి రమణయ్య, సుబ్బారావు, దారపనేని చెన్నయ్య, పెండ్యాల లక్ష్మీనరసయ్య తదితరులు ఉన్నారు.

